సంక్షేమాన్ని చూసి ఓర్వలేక తప్పుడు కథనాలు

- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- జగపతినగరంలో 'ఈనాడు' ప్రతులు దహనం



జగపతినగరంలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే చంటిబాబు

కిర్లంపూడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ఈనాడు అధినేత రామోజీరావు తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారని ఎంపీ వంగా గీత అన్నారు. టీడీపీ నేత కొమ్మారెడ్డి పట్టాభిని కొట్టారంటూ 'ఈనాడు' ప్రచురించిన కథనాలకు నిరసనగా శుక్రవారం స్థానిక జగపతినగరం ప్రధాన రహదారిపై కాకినాడ ఎంపీ వంగా గీత, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి 'ఈనాడు' ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ ప్రజల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని పచ్చ పత్రికలు తప్పుడు రాతలు రాస్తున్నాయన్నారు. గతంలో ప్రభుత్వాలను కూల్చేందుకు పచ్చ పార్టీ నేతలు ఓ పత్రికను వాడుకున్నారన్నారు. ఇప్పుడూ అదే పత్రికను వాడుకుని ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న తమ ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు సామాజిక న్యాయం తమ ప్రభుత్వంలోనే సాధ్యమైందన్నారు. ప్రభుత్వంపై నిందలు వేసి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి 'ఈనాడు' తప్పుడు కథనాలను ప్రచురిస్తోందన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు మాట్లాడుతూ ప్రజల మన్ననలు పొందలేక ప్రతిపక్ష పార్టీ తమ పచ్చ పత్రికల్లో అసత్యాలను ప్రచురిస్తోందన్నారు. ప్రతిపక్షాలు చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎల్లో మీడియాల్లో ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ, పార్టీ మండలాధ్యక్షుడు దోమాల గంగాధర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జంపన బాబు, మండల సచివాలయాల కన్వీనర్ పి.రాజేష్, దాడి అప్పలరాజు, సర్పంచ్ తోట అయ్యన్న, భూపాలపట్నం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈనాడుపై వెల్లువెత్తిన నిరసన



తుని గొల్ల అప్పారావు సెంటర్లో మానవహారంగా ఏర్పడిన నాయకులు

తుని: ప్రజల పక్షాన వార్తలు ప్రచురించాల్సిన పత్రికలు ఒక పార్టీకి కొమ్ము కాస్తూ అసత్య కథనాలను ప్రజలపై బలవంతంగా రుద్దడం ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టు అని తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం తునిలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు ఈనాడు తప్పుడు కథనాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి గొల్ల అప్పారావు సెంటర్ వరకూ ర్యాలీ చేసి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం ఈనాడు ప్రతులను దహనం చేశారు. నిజాలను దాచి అబద్ధాలను ప్రచురిస్తున్న రామోజీరావ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి మాట్లాడుతూ ప్రజల కోసం ముఖ్యమంత్రి నిరంతరం శ్రమిస్తూ పని చేస్తుంటే ఈనాడు పత్రిక ప్రతిరోజు తానే ప్రతిపక్షం అన్న రీతిలో తప్పుడు కథనాలు ప్రచురిస్తోందన్నారు. ఇటువంటి నైతిక విలువలేని పత్రికను ప్రజలు బహిష్కరించాలని కోరారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5 ప్రజల కోసం కాకుండా చంద్రబాబు కోసం పని చేస్తున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే ఆయా పత్రికలను ప్రజలు తరిమి కొడతారని కాకినాడ జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

తొండంగిలో..

తొండంగి: ప్రజలను తప్పుదోవ పట్టించేలా టీడీపీ నేత పట్టాభి పాత ఫొటోలతో అసత్య కథనాలు ప్రచురించిన ఈనాడుపై వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ బూత్ కమిటీల తుని నియోజకవర్గ కన్వీనర్ గాబు రాజు ఆధ్వర్యంలో మండలంలోని ఒంటిమామిడి జంక్షన్ వద్ద ఈనాడు ప్రతులను దహనం చేశారు. తప్పుడు కథనాలతో ప్రజలను మభ్యపెడుతున్న ఈనాడు రామోజీరావు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కోటనందూరులో..



ఒంటిమామిడి జంక్షన్‌లో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోటనందూరు: టీడీపీ నేత పట్టాభి వ్యవహారంలో ఈనాడు దిన పత్రిక ప్రచురించిన తప్పుడు కథనాలకు నిరసనగా శుక్రవారం కోటనందూరులో వైఎస్సార్ సీపీ నాయకులు ర్యాలీ చేశారు. స్థానిక బస్‌స్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ చేసి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం ఈనాడు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ లగుడు శ్రీనువాస్ మాట్లాడుతూ ఈనాడు పత్రిక వాస్తవాలను తెలుసుకుని కథనాలను ప్రచురించాలని, తప్పుడు కథనాలు ప్రచురిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లక్క ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చిన్నబాబు, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్య నాయుడు, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకూ గుర్తింపు

ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజును అభినందిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాలకూ గుర్తింపు లభిస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని సిరిపురంలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన చింతల రాజును శుక్రవారం ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి వర్గానికీ ప్రాధాన్యం ఇచ్చారన్నారు. అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎన్నడూలేని విధంగా అన్ని కులాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, శిగడం వెంకటేశ్వరరావు, రామిశెట్టి చినబాబు, దళే చిట్టిబాబు, గొంతిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి పుష్కరిణి ప్రారంభోత్సవాలకు శ్రీకారం



ఎస్.అన్నవరంలో స్వామివార్ల విగ్రహాలతో శోభాయాత్ర చేస్తున్న భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని ఆనుకుని నిర్మించిన శ్రీవారి పుష్కరిణి ప్రారంభోత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. పండితులు ఉదయం ఎనిమిది గంటలకు స్వామివారికి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, గోపూజ, వాస్తు హోమం, శాంతి పర్యగ్నికరణం, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, అఖండ దీపారాధన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తుని పట్టణం పుంతలోముసలమ్మ గుడి నుంచి ఎస్.అన్నవరంలో పుష్కరిణి వరకూ ప్రతిష్ఠి విగ్రహాల ఊరేగింపు (శోభాయాత్ర) వైభవంగా నిర్వహించారు. తుని పాత సంచుల వర్తక సంఘం, గ్రామ ప్రజల సహకారంతో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్నట్టు దేవస్థానం చైర్మన్ కోలా భీమేశ్వరరావు తెలిపారు.

నేడు ప్రత్యేక పూజలు

పుష్కరిణి ప్రారంభోత్సవాల్లో భాగంగా శనివారం వేద, దివ్య ప్రభంద పారాయణం, యాగశాల ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ, మహాకుంభ చక్రబ్జ మండల ఆరాధన, శాంతి హోమం, కలశారాధన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శివకుమార్

రౌతులపూడి: జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకం పథకంలో చేపట్టిన రీ సర్వేతో గ్రామాల్లో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ ఎల్.శివకుమార్ అన్నారు. మండలంలోని ఎ.మల్లవరం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం భూముల రీసర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూముల రీ సర్వేపై రైతుల ఎలాంటి అపోహలకు పోవద్దన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సర్వే చేస్తామన్నారు. డ్రోన్, రోవర్ వంటి అత్యాధునిక పరికరాలతో భూముల సర్వే చేసి రికార్డులు తయారు చేస్తారన్నారు. రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రామ సచివాలయాల్లో సర్వే బృందాలకు తెలియజేయాలన్నారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు చిందాడ పెదరాజు, వడ్లశ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు బొడ్డు రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కాకి నాని, నాకిరెడ్డి అప్పలనాయుడు, నాకిరెడ్డి పెద్దాపురం, బి.రామకృష్ణ, వీఆర్‌ఓ గిరి, సచివాలయ కార్యదర్శి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగ

తప్పిన పెనుప్రమాదం



తెగిపడిన విద్యుత్ తీగ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న రహదారి నిర్వహణ సిబ్బంది

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని బొర్రంపాలెం భారత్ పెట్రోల్ బంక్‌కు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ తీగ తెగిపడింది. అక్కడ విధి నిర్వహణలో ఉన్న రోడ్డు మెయింటినెన్స్ ఆర్‌పీవో ఎస్‌కే చాన్ బాషా, సిబ్బంది విషయాన్ని గమనించి రహదారి ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. దీంతో ఐఎంటీ మేనేజర్ సీహెచ్ సుబ్బారావు, అసిస్టెంట్ మేనేజర్ వీఎస్‌డీ ధనకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి ఆ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. విద్యుత్ తీగ తెగిన ప్రాంతంలో రాకపోకలు ఆపి వేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని తెగిపోయిన విద్యుత్ తీగ స్థానంలో మరో విద్యుత్ తీగను ఏర్పాటు చేశారు. రోడ్డు మెయింటినెన్స్ సిబ్బంది అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది.

కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ర్యాలీ



ఏలేశ్వరంలో ఆందోళన చేస్తున్న సీపీఎం శ్రేణులు

ఏలేశ్వరం: కేంద్ర బడ్జెట్‌లో పేదల సంక్షేమానికి నిధులు కేటాయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం మండల అధ్యక్షుడు పాకలపాటి సోమరాజు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ర్యాలీ చేసి స్థానిక బాలాజీ చౌక్ సెంటర్‌లో ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా సభ్యుడు చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ 2023–24 ఏడాదికి సంబంధించి కేంద్ర బడ్జెట్‌లో ఆహార సబ్సీడీపై కోత విధించారన్నారు. గతేడాది కంటే ఉపాధి హామీ పథకంలో ఈ ఏడాది రూ.20 వేల కోట్లు తగ్గించారన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఆదాయ పన్ను 30 శాతం నుంచి 22 శాతం తగ్గించడం అన్యాయమన్నారు. కేంద్రం పేదలకు అన్యాయం చేసి కార్పొరేట్లకు కొమ్ము కాస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పిల్లా రాంబాబు, వేమగిరి దొంగబాబు, పెదపాటి గురవమ్మ, రమణమ్మ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పరిశీలన

గోకవరం: స్థానిక గంగాలమ్మ గుడి వెనుక పోలవరం ముంపు బాధితుల కోసం నిర్మిస్తున్న ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని 522 గృహాలను పోలవరం ముంపు నిర్వాసితులు శుక్రవారం పరిశీలించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలోని పోలవరం ముంపు నిర్వాసితుల కోసం ప్రభుత్వం గోకవరంలో గృహాలు నిర్మిస్తోంది. వీటిని నిర్వాసితులు పరిశీలించి గృహాల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

వేద పండితులు హనుమంతువజ్జుల అవధాని, కోట శ్రీనివాస్, చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. ఏఈఓ భ్రమరాంబ, వైఎస్సార్ సీపీ నాయకుడు బదిరెడ్డి గోవింద్‌తో పాటు 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కొండ దిగువన తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తలుపులమ్మతల్లికి మహాచండీ హోమం

తుని రూరల్: లోవదేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారికి శుక్రవారం మహాచండీ హోమం నిర్వహించారు. వేదపండితులు రాణి సుబ్రహ్మణ్య శర్మ, శశాంక్ త్రిపాఠి, పురుషోత్తమ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు.

నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు



వి.కొత్తూరులో సేంద్రియ సాగుపై అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, సచివాలయ సిబ్బంది

తుని రూరల్: సేంద్రియ పద్ధతుల్లో నవధాన్యాలు సాగు చేస్తే బహుళ ప్రయోజనాలు కలుగుతాయని హంసవరం సర్పంచ్ రాయి మేరీ అవినాష్ అన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం హంసవరం, వి.కొత్తూరు గ్రామాల్లో విద్యార్థులు, స్థానికులతో కలసి నవధాన్యాల సాగుపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. హంసవరం అవగాహన సదస్సులో సర్పంచ్ మేరీఅవినాష్ మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకాన్ని తగ్గించాలన్నారు. సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. నవధాన్యాల సాగుతో కలిగే లాభాలు, సాగు విధానం, భూసారం పెంపు, తదితర విషయాలను ఎంసీఆర్‌పీ రామరాజు, ఎఫ్ ఎంటీ సంధ్య వివరించారు. పంచాయతీ కార్యదర్శులు ఇ.శంకర్, రాజబాబు, వీఏఏలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై వైద్య సిబ్బందికి అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్లు సూర్యప్రభ, సూర్యారావు

గోకవరం: మండలంలోని జి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి క్యాన్సర్ వ్యాధిపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు సూర్య ప్రభ, వి.సూర్యారావు క్యాన్సర్ లక్షణాలను గుర్తించడం, వ్యాధి తీవ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. 30 సంవత్సరాలు దాటిన స్త్రీలలో గైనిక్, రిప్రొడక్టివ్ ట్రాక్ ఇన్ఫెక్షన్స్, పొగతాగడం, మద్యం సేవించడం, పొగాకు నమలడం వంటి అలవాట్లు ఉన్నవారిలో క్యాన్సర్ గుర్తించడంపై వైద్యులకు వివరించారు.

మార్చి 2న గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ కేసులను స్క్రీనింగ్ చేస్తారని, అనుమానిత లక్షణాలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మేరి కృప, ఎంపీహెచ్ఈఓ రాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడిగా ఉమారావు



తుని: వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా బొంగు ఉమారావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అనుబంధ విభాగాల కో ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఉమారావు లోవదేవస్థానం చైర్మన్‌గా పని చేశారు. ఈ సందర్భంగా ఉమారావు మాట్లాడుతూ తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

దివ్యాంగులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ



దివ్యాంగ పిల్లలకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న సూర్యకుమార్

ఏలేశ్వరం: పట్టణంలో దివ్యాంగ విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నేత, మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ జన్మదినం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఆయన పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకలు కోరాడ ప్రసాద్, పైల విజయ్‌కుమార్, చందక కిరణ్, పతివాడ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య కళాశాలలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ ప్రారంభించారు. కాకినాడ దృష్టి హాస్పిటల్ డాక్టర్ మాధురి సుమారు 300 మందికి కంటి పరీక్షలు చేశారు. కంటి సంరక్షణపై విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం కో ఆర్డినేటర్ ఎం.రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

జగ్గంపేట: జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస యోజన (పీఎంకేవీవై)లో భాగంగా అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో నాలుగు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ రాధాకృష్ణన్ శుక్రవారం తెలిపారు. ఈ కోర్సుకు పదో తరగతి పాస్ లేదా ఫెయిలైన 15 నుంచి 45 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థుల ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 95020 89936 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చింతలూరులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు నాసా స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన దుమ్ముల సుశీల, బొండు అప్పలకొండ కుటుంబాలకు శుక్రవారం నాసా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఎస్.జ్యోతిప్రేమ్‌దాస్ ఆధ్వర్యంలో వంట సామగ్రి, దుస్తులు, దుప్పట్లు, బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో నాసా సిబ్బంది ఆర్. నాగేశ్వరరావు, పద్మ, రావు, తదితరలు పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

జగ్గంపేట: మండలంలోని నరేంద్రపట్నం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో సారా తయారీ కేంద్రాలపై జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో నరేంద్రపట్నం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. సారా తయారీకి సిద్ధం చేసిన 100 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తుని రూరల్: కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుని మండలం లోవకొత్తూరు శివారు సీతయ్యపేటకు చెందిన కొండ్రు లోవరాజు (55) మృతి చెందినట్టు రూరల్ ఎస్సై ఎ.బాలాజీ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...ఈ నెల 22న సీతయ్యపేట నుంచి తుని వెళ్లేందుకు లోవరాజు సైకిల్‌పై జగన్నాథగిరి జంక్షన్‌లో జాతీయ రహదారిని దాటుతుండగా అటుగా వస్తున్న మోటార్ సైకిలిస్టు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లోవరాజును బంధువులు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఉచిత బస్ పాసులకు దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: దివ్యాంగులకు ఏపీఎస్ ఆర్టీసీ అందిస్తున్న ఉచిత బస్ పాసులను సద్వినియోగం చేసుకోవాలని హంసవరం సర్పంచ్ రాయి మేరీఅవినాష్ సూచించారు. హంసవరం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం హంసవరం, హెచ్.కొత్తూరు గ్రామాలకు చెందిన దివ్యాంగులకు ఉచిత బస్ పాసులు జారీ చేసేందుకు ఆర్టీసీ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేరీ అవినాష్ మాట్లాడుతూ మూడేళ్ల కాలపరిమితితో జారీ చేస్తున్న బస్ పాసులకు రూ.100, ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్ నకళ్లు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 42 మంది నుంచి అందిన దరఖాస్తులను ఆర్టీసీ అధికారులు ప్రకాష్, కృష్ణలకు సర్పంచ్ అందజేశారు. దరఖాస్తుదారులందరికీ శనివారం బస్‌పాస్‌లను అందజేస్తామని అధికారులు తెలిపారు. కార్యదర్శి శంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలి

ఏలేశ్వరం: డ్వాక్రా రుణాల పేరుతో మహిళలను మోసగించిన వారిని శిక్షించి, మహిళలకు న్యాయం చేయాలని సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొసిరెడ్డి గణేశ్వరరావు మాట్లాడుతూ 2019లో పట్టణంలోని 14 డ్వాక్రా సంఘాలకు రుణాల మంజూరు చేసి ఆ సొమ్ములను గ్రూపు సభ్యులకు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. దీనిపై విచారణ జరిపి డ్వాక్రా మహిళలను మోసం చేసిన యానిమేటర్లు, ఉద్యోగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సూరపు రాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గండేటి నాగమణి, కళావతి, భవాని, దేవి తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ప్రత్తిపాడు: తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో న్యాయవాది శ్రీసురేందర్‌పై దాడికి నిరసనగా ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ప్రాంగణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ మాట్లాడుతూ ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు పెరిగిపోయాయన్నారు. న్యాయవాది సురేందర్‌పై దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ ప్రతినిధులు రాజాల చిట్టిబాబు, ఎం.గంగాధర్‌రావు, ఏకేఎస్ మల్లేశ్వరరావు, కె.సూర్యప్రకాశరావు, కీలపర్తి శ్రీనివాస్, పలివెల నాగేంద్ర, రాయి అత్యుతరామారావు తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లం వాహనాన్ని అడ్డుకున్న గిరిజనులు

శంఖవరం: మండలంలోని పి.మల్లాపురంలో శుక్రవారం నల్లబెల్లం తరలిస్తున్న వాహనాన్ని గిరిజనులు అడ్డుకున్నారు. వాహనంలో తీసుకువచ్చిన నల్ల బెల్లానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. నల్లబెల్లం అక్రమ రవాణాపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆధునిక యుగంలో డేటా మేనేజ్‌మెంట్ కీలకం

గండేపల్లి: ఆధునిక యుగంలో డేటా మేనేజ్‌మెంట్ ఎంతో ముఖ్యమైనదని వరంగల్ ఎన్ఐటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ రామలింగస్వామి అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో శుక్రవారం కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ డేటా సైన్స్ అనే అంశంపై ఒక్కరోజు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు డేటా మేనేజ్‌మెంట్ రంగంలో విద్యార్థులకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. డేటా మేనేజ్‌మెంట్‌లో అప్లికేషన్స్, ఉపయోగాల గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డోలా సంజయ్, డీన్ ఎ.రామకృష్ణ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి అనిల్ కుమార్, సీహెచ్‌వీవీఎస్ఎన్ మూర్తి, ఆర్‌వీఎస్ లలిత, అంబికా తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

శంఖవరం: గ్రామంలో దోమల నియంత్రణకు చర్యలు తీసుకున్నట్టు గౌరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు తెలిపారు. మండలంలోని గౌరంపేటలో శుక్రవారం దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది డ్రైన్లు, మురికివాడలు, వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ప్రధాన రహదారులపై ఫాగింగ్ చేశారు. ప్రతిఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ సూచించారు.

ఆస్పత్రిలో వసతులు కల్పించాలి

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు కల్పించాలని జైభీం భారత్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడిశెట్టి వీరబాబు కోరారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద శుక్రవారం పార్టీ శ్రేణులు ప్లకార్డులతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్స్ రే మెషీన్ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎక్స్‌రే మెషీన్‌తో పాటు వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు సుర్లపాటి బాబులు, గాది గౌతం, గొడుగు కనకరత్నం, బోతురాజు శ్రీను, వాసా లాజర్ పాల్గొన్నారు.

ఆక్వాపై రైతులకు అవగాహన

కిర్లంపూడి: మండలంలోని గోనేడలో రైతులకు శుక్రవారం ఆక్వా జోన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ బి.రాజేంద్రరావు మాట్లాడుతూ ఆక్వా సాగు చేసే రైతులు తమ చెరువులను ఆక్వా జోన్‌లోకి మార్చుకోవాలన్నారు. తద్వారా ఆక్వాసాగు అభివృద్ధికి ప్రభుత్వం అందించే బెనిఫిట్స్‌కు అర్హులు అవుతారన్నారు. ఎంపీటీసీ అల్లు శివరామకృష్ణ, సచివాలయ ఫిషరీస్ అసిస్టెంట్ మౌనిక, రైతులు పాల్గొన్నారు.